
మంత్రి సీతక్కకు వినతి పత్రం అందజేస్తున్న సర్పంచ్‌లు

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

● మంత్రి సీతక్కకు అబ్దుల్లాపూర్‌మెట్ సర్పంచుల వినతి

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పెండింగ్ బిల్లుల విడుదల చేయాలని సర్పంచులు కోరారు. బుధవారం సచివాలయంలో పంచాయతీరాజ్ శాఖమంత్రి సీతక్కను అబ్దుల్లాపూర్‌మెట్ సర్పంచ్‌లు కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామ పరిధిలో చేసిన పలు అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు 16 నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని వారు మంత్రిని కోరారు. ఉప సర్పంచ్‌తో ఉన్న జాయింట్ చెక్‌పవర్ తొలగించి, దాని స్థానంలో సర్పంచ్, సెక్రెటరీతో కలిసి జాయింట్ చెక్‌పవర్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు దూసరి సుజాతయాదయ్య, స్వరూప వీరస్వామియాదవ్, సంతోషకిషన్, లావణ్యపాపిరెడ్డి, పోచంపల్లి సుధాకర్‌రెడ్డి, చెరుకు కిరణ్‌కుమార్‌గౌడ్, కవాడి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కేఎల్‌ఆర్, పక్కన నర్సింహారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి తదితరులు

జెండా మోసిన ప్రతి ఒక్కరికీ అండగా ఉంటా

ఎల్‌బీనగర్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): కష్టకాలంలో పార్టీ జండా మోసిన ప్రతి ఒక్కరికీ అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే కిచ్చెనగారి లక్ష్మారెడ్డి(కేఎల్‌ఆర్) అన్నారు. కాంగ్రెస్ ఆర్‌కేపురం డివిజన్ మాజీ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత అధ్యక్షతన బుధవారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ప్రజా పాలన ప్రవేశపెట్టి అభయ హస్తం ద్వారా పథకాలు అందజేస్తుందని, ఆ పథకాలు అర్హులైన ప్రజలకు అందేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని సూచించారు. గురువారం ఎల్‌బీస్టేడియంలో జరుగనున్న రాష్ట్రస్థాయి కాంగ్రెస్ పార్టీ బూత్ ఇన్‌చార్జిల సమావేశాని సమావేశానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే రానున్నారని ఆయన పేర్కొన్నారు. డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డిలు మాట్లాడుతూ కష్టపడే ప్రతి కార్యకర్తకు పార్టీ న్యాయం చేస్తుందన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి, హరిపురికాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకటేష్‌గుప్తా, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జ్ఞానేశ్వర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

యూజీడీ పనులు నాణ్యతతో పూర్తి చేయాలి

● కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలో జరుగుతున్న యూజీడీ పనులు నాణ్యతతో పూర్తి చేయాలని కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం చంపాపేట డివిజన్ భైరామల్‌గూడలోని సాయినగర్‌కాలనీ, ప్రగతినగర్‌కాలనీలలో కార్పొరేటర్ పర్యటించి, ఆయా కాలనీలలో కొనసాగుతున్న వరదనీటి కాలువ, యూజీడీ పనులను పరిశీలించారు. సాయినగర్‌కాలనీలో వరదనీటి నివారణ కోసం రూ.29లక్షలతో పైపులైన్ పనులు, ప్రగతినగర్‌కాలనీలో రూ.7లక్షలతో యూజీడీ పనులు చేపట్టినట్లు కార్పొరేటర్ తెలిపారు. యూజీడీ పనులు పూర్తికాగానే రహదారి నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం సరిత, జీహెచ్‌ఎంసీ ఏఈ సురేష్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి

చాదర్‌ఘాట్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): అర్హులైన లబ్ధిదారులు కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి అన్నారు. బుధవారం మూసారాంబాగ్ డివిజన్‌లోని బాలమ్మ దానమ్మ బస్తీలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర పథకాలు అయిన ముద్ర లోన్, పీఎం ఉజ్వల యోజన, ఆధార్ కరెక్షన్, పీఎం ఆవాజ్ యోజన, పీఎం స్వయ నిధియోజన, జీవన జ్యోతి బీమా యోజన పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడానికే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహిస్తున్నట్లు ఆమె వివరించారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ సీనియర్ మేనేజర్ శ్రీనివాస్‌బాబు, జీహెచ్‌ఎంసీ యూసీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్ యుగంధర్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ బీర్జున్నీసా, డాక్టర్ ప్రణీత్, టీబీ డాక్టర్ సౌజన్య, టీబీ అవగాహన కార్యక్రమం ఇన్‌చార్జి శ్రీనివాస్, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు కొప్పుల దినేష్, మాజీ అధ్యక్షుడు యాదగిరి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వ భాషా కవి సమ్మేళనం

హైదరాబాద్ సిటీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పబ్లిక్ దినోత్సవం సందర్భంగా ఆకాశవాణి ప్రతియేటా ప్రసారం చేసే సర్వభాషా కవి సమ్మేళనం గురువారం రాత్రి పది గంటలకు ప్రసారమవుతుందని ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం విభాగం అధిపతి వి.ఉదయ్‌శంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కవి సమ్మేళనంలో తెలుగు కవి డా.మల్లెగోడ గంగాప్రసాద్ 'వలస జీవి' కవితతో పాటు వివిధ భాషల కవితలకు అనువాదాలు ప్రసారమవుతాయన్నారు. జనవరి 5 రాంచీలో నిర్వహించిన ఆకాశవాణి సర్వ భాషా కవిసమ్మేళనంలో పాల్గొన్న 22 భాషల కవుల కవితలను తెలుగులోకి అనువాదం చేయించి ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం రూపొందించిన కార్యక్రమం తెలుగు రాష్ట్రాల్లో అన్ని కేంద్రాల ద్వారా ప్రసారమవుతుందని తెలిపారు.

థీమ్ పార్కును ప్రారంభించేది ఎప్పుడో...

● ఐఎస్ సదన్ డివిజన్ లక్ష్మీనగర్ కాలనీలో 2,500 గజాల స్థలంలో రూ. 2 కోట్లతో ఏర్పాటు
● పట్టించుకోని అధికారులు
● 11 నెలలుగా గేటుకు తాళం




లక్ష్మీనగర్ థీమ్ పార్కు

సైదాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కాలనీలు, బస్తీల్లో పచ్చదనం తీసుకొచ్చి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు అధికారులు పార్కులు ఏర్పాటు చేశారు. వాటిల్లో పిల్లలు ఆడుకోవడానికి ప్లే ఏరియా, ఆటవస్తువులు సమకూర్చారు. ఐఎస్‌సదన్ డివిజన్ లక్ష్మీనగర్ కాలనీలో 2,500 గజాలకు పైగా స్థలంలో రూ. కోట్లతో థీమ్ పార్కును ఏర్పాటు చేశారు. పార్కులో విదేశాల నుంచి తీసుకొచ్చిన అత్యంత ఖరీదైన సామగ్రిని ఏర్పాటు చేశారు. పార్కు నిర్వహణ చూసేందుకు వాచ్‌మన్‌ను నియమించారు. పనులు పూర్తి అయి 11 నెలలు అవుతోంది. అయినా ప్రారంభానికి నోచుకోవడం లేదు. కాంట్రాక్టర్‌కు బిల్లుల చెల్లింపులలో అలస్యంగా జరుగుతుండటంతో ప్రారంభించేందుకు ముందుకు రావ డంలేదని స్థానికులు వాపోతున్నారు. కాలనీవాసులు జీహెచ్‌ఎంసీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. దాంతో 11 నెలల నుంచి పార్కులోకి ప్రజలు వెళ్లకుండా గేటుకు తాళం వేసి ఉంచారు.

వాకింగ్ ట్రాక్‌లు ప్లే ఏరియా

లక్ష్మీనగర్ థీమ్ పార్కులో మహిళలు పిల్లలు, పెద్దలు సేదతీరేలా ఏరాట్లు చేశారు. పార్కులో 50 రకాల ఔషధ మొక్కలతో పచ్చదనంతోపాటు వాకింగ్ ట్రాక్, ప్లే ఏరియా, యోగా సెంటర్ సిద్ధం చేశారు. కిట్టీ పార్టీల కోసం ప్రత్యేక స్థలం ఏర్పాటు చేశారు. మానసిక ఒత్తిడి తగ్గి ఆరోగ్యానికి ఉపకరిస్తుందని ఉద్దేశంతో వాకర్స్ కోసం పార్కులో కంకరరాళ్లు, నల్లరేగడి, మట్టి, నీరు. ఇసుకరేణువులు, గులకరాళ్లు పోసి దారులు ఏర్పాటు చేశారు. పడవ ఆకారంలో ఉండే సెల్ఫీ స్పాట్‌ను పార్కులో సిద్ధం చేశారు. లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయడంలో సంవత్సర కాలంగా అధికారులు కాలయాపన చేస్తున్నారు.

అందుబాటులోకి తేవాలి



అధునాతన సదుపాయాలతో థీమ్ పార్కును అభివృద్ధి చేసి ప్రారంభించకపోవడం బాధగా ఉంది. అధికారులకు పలుమార్లు కలిసి విన్నవించినా ఎప్పుడు ప్రారంభిస్తారనే విషయంపై స్పష్టత ఇవ్వడం లేదు. పార్కులో విద్యుత్ లైన్ ఇవ్వకపోవడంతో ప్రారంభించడం లేదని సాకులు చెబుతున్నారు. వీలైనంత తొందరగా పార్కును ప్రారంభించి కాలనీ వాసులకు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరముంది.

-చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యక్షుడు, లక్ష్మీనగర్ కాలనీ సంక్షేమ సంఘం

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపట్టాలి


అభివృద్ధి పనులపై అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

వనస్థలిపురం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపట్టాలని ఎల్బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అధికారులకు సూచించారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్, క్రిస్టల్ విల్లాస్ దగ్గర నూతనంగా నిర్మించబోతున్న స్టామ్ వాటర్ డ్రైన్ పనులపై బుధవారం సంబందిత అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సాగర్ కాంప్లెక్స్ నుంచి గుర్రంగూడ అటవీప్రాంతం మీదుగా పాపిరెడ్డి కాలనీ కమాన్ వరకు స్టామ్ వాటర్ డ్రైన్స్ నిర్మాణ పనులు పూర్తి చేశామన్నారు. పాపిరెడ్డి కాలనీ దిగువ ప్రాంతం నుంచి మునగనూర్ వరకు మరొక స్టామ్ వాటర్ డ్రైన్స్ పనుల కోసం నిధులు మంజూరు అయ్యాయని, పనులు ప్రారంభించడానికి ఏర్పాట్లు చేయాలనీ అధికారులకు సూచించారు. పనులు సకాలంలో పూర్తి అయితే చుట్టుపక్కల కాలనీవాసులకు ముంపు సమస్యల నుంచి పూర్తి స్థాయిలో విముక్తి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ పవన్, వాటర్ వర్క్స్ మేనేజర్ సిరివెన్నల, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ల అప్రమత్తతోనే రోడ్డు ప్రమాదాలు నివారించొచ్చు

● ఉత్తమ డ్రైవర్లకు సన్మానం


ఉత్తమ డ్రైవర్లను సన్మానిస్తున్న ఆర్ఎం శ్రీధర్, ఎస్ఐ గంగాధర్

హయత్‌నగర్/చాదర్‌ఘాట్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): డ్రైవర్లు బస్సులను నడిపే సమయంలో అప్రమత్తంగా ఉండడం వల్లే రోడ్డు ప్రమాదాలను నివారించ వచ్చని ఆర్టీసీ రంగారెడ్డి రీజినల్ మేనేజర్ ఎ.శ్రీధర్ అన్నారు. ఆర్టీసీ సంస్థకు మూల స్తంభం డ్రైవర్ అని, అతడు లేనిదే బస్సు చక్రాలు ముందుకు కదలవని వనస్థలిపురం ట్రాఫిక్ సీఐ బాలు చౌహాన్ అన్నారు. బుధవారం హయత్‌నగర్ ఆర్టీసీ-1, 2, హైదరాబాద్ బస్ డిపోలలో డ్రైవర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విధినిర్వహణలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా బస్సులు నడిపిన ఉత్తమ డ్రైవర్లు శంకరయ్య, వీఎంరెడ్డి, మోహన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డిలను సన్మానించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన రంగారెడ్డి జిల్లా ఆర్టీసీ రీజినల్ మేనేజర్ శ్రీధర్, వనస్థలిపురం ట్రాఫిక్ సీఐ బాలు చౌహాన్, మలక్‌పేట ట్రాఫిక్ ఎస్ఐ గంగాధర్ మాట్లాడుతూ నగరంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్‌లో బస్సులు నడపడం డ్రైవర్లకు చాల కష్టమైపన పని అన్నారు. డ్రైవర్ల అప్రమత్తతోనే ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చి, విధులు ముగించుకుని వారు క్షేమంగా ఇంటికి వెళ్తున్నారని అన్నారు. ఆయా కార్యక్రమాలలో డిపో మేనేజర్లు విజయ్, శ్రీనివాస్, కృష్ణమూర్తి ఆర్టీసీ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.


పూజితను సన్మానిస్తున్న భట్టి విక్రమార్క

పూజితకు డిప్యూటీ సీఎం సన్మానం

ఎల్‌బీనగర్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ విమెన్స్ అండర్-23 కెప్టెన్ త్రిషా పూజితను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సన్మానించారు. డబ్ల్యూపీఎల్ గుజరాత్ జైంట్స్ టీమ్‌కు త్రిష పూజితను కెప్టెన్‌గా ఎంపిక చేయడం సంతోషకరమన్నారు. మహిళా క్రికెట్ క్రీడాకారులకు త్రిష స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. భవిష్యత్తులో త్రిష పూజిత దేశావళి క్రికెట్‌లో ప్రతిభ కనబరిచి భారత క్రికెట్ జట్టుకు ఎంపికై స్థానాన్ని సుస్థిరం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో త్రిషకు శిక్షణ ఇచ్చిన కోచ్ శ్రీనివాస్, చాముండేశ్వర్‌నాథ్, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ క్రికెట్ కోచ్ రాజశేఖర్‌రెడ్డిలను అభినందించారు.

సీఎం సోదరుడి బంధువులమంటూ దౌర్జన్యం..!

● లీజు అగ్రిమెంట్ విషయంలో వివాదం ● భూ యజమానులపై దాడి

సరూర్‌నగర్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): క్రికెట్ గ్రౌండ్ లీజు అగ్రిమెంట్ విషయంలో తలెత్తిన వివాదం ఘర్షణకు దారి తీసింది. గ్రౌండ్‌కు సంబంధించిన భూయజమానులకు, లీజుదారులకు మధ్య జరిగిన ఈ ఘర్షణలో.. లీజుదారులు తాము సీఎం సోదరుడు కొండల్‌రెడ్డి బంధువులమంటూ దాడికి పాల్పడినట్టు బాధితులు ఆరోపించారు. ప్రత్యక్ష సాక్ష్యులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... జిల్లెలగూడ లలితానగర్‌లో కొత్తకాపు నర్సింహారెడ్డి, ఆయన కుమారులు శ్రీధర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డిలకు కొంత భూమి ఉంది. దానిని గతంలో రాజవర్ధన్‌రెడ్డికి క్రికెట్ గ్రౌండ్ కోసం లీజుకు ఇచ్చారు. ఇటీవల అదే స్థలాన్ని ఓ స్కూల్ కోసం లీజుకు ఇచ్చారు. ఈ క్రమంలో గ్రౌండ్‌ను ఖాళీ చేయాలని, అక్కడ క్రికెట్ ఆడొద్దని యజమానులు లీజుదారుడికి చెప్పారు. తమకు ఇచ్చిన లీజు గడువు ముగియనందున ఖాళీ చేయబోమని రాజవర్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇదే అంశం ఇద్దరి మధ్య వివాదానికి కారణమయింది. బుధవారం భూయజమానులు శ్రీధర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, బీఆర్ఎస్ మీర్‌పేట్ శాఖ అధ్యక్షుడు కామేశ్‌రెడ్డితోపాటు మరో పదిమంది యువకులు గ్రౌండ్ వద్ద కూర్చుని అక్కడకు ఎవరూ రాకుండా అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న రాజవర్ధన్‌రెడ్డి హస్తినాపురంకు చెందిన కాంగ్రెస్ నాయకులు శశిధర్‌రెడ్డి, రమేశ్‌తో పాటు 50-60 మంది అక్కడకు వెళ్లి వారితో గొడవకు దిగారు. మాటామాటా పెరిగి పరస్పరం దాడులకు పాల్పడ్డారు. తాను సీఎం సోదరుడు కొండల్‌రెడ్డి బంధువునని, తమ జోలికి వస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని బెదిరిస్తూ రాజవర్ధన్‌రెడ్డి తమపై దాడి చేశాడని బాధితులు శ్రీధర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, కామేశ్‌రెడ్డి ఆరోపించారు. విషయం తెలుసుకున్న మీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ తన బృందంతో అక్కడకు చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ జరుపుతున్నారు.

యువతి వివాహానికి ఉప్పల ఫౌండేషన్ చేయూత



మంగళసూత్రం, మెట్టెలు అందజేస్తున్న శ్రీనివాస్‌గుప్తా, స్వప్న దంపతులు

మన్సూరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పేద యువతి వివాహానికి ఉప్పల ఫౌండేషన్ చేయూతనిచ్చింది. వనస్థలిపురానికి చెందిన వాసు-కృష్ణవేణి దంపతుల కుమార్తె రూపాన్సీకి పెళ్లి నిశ్చయం అయింది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా కుటుంబ సభ్యులు ఉప్పల ఫౌండేషన్‌ను తమ కుమార్తె వివాహానికి ఆర్థికంగా సహకరించాలని కోరారు. స్పందించిన ఫౌండేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా- స్వప్న దంపతులు మంగళసూత్రం, చీర, మెట్టెలు, గాజులను బుధవారం నాగోల్‌లోని తమ నివాసంలో అందజేశారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత

దిల్‌సుఖ్‌నగర్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): గడ్డిఅన్నారం డివిజన్, శివగంగ థియేటర్ సమీపంలో కొనసాగుతున్న అక్రమ నిర్మాణంపై మున్సిపల్ అధికారులు కొరఢా ఝులిపించారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించిన కొందరు ప్రైవేటు వ్యక్తులు అక్రమంగా షెడ్డు నిర్మాణం చేపట్టారని ఇప్పటికే పలువురు స్థానికులతోపాటు, గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డిలు పలుమార్లు జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేయగా, వారి నుంచి స్పందన లేకపోవడంతో ఉన్నతాధికారులకు కూడ ఫిర్యాదులు చేశారు. స్పందించిన జీహెచ్‌ఎంసీ అధికారులు బుధవారం అక్రమ నిర్మాణం వద్దకు వచ్చి షెడ్డును కూల్చి వేశారు. సరూర్‌నగర్ సర్కిల్ ఉపకమిషనర్ అరుణ మాట్లాడుతూ అక్రమ నిర్మాణదారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమ నిర్మాణాలపై త్వరలోనే స్పెషల్ డ్రైవ్ నిర్వహించి చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

ప్రభుత్వ స్థలం కబ్జాచేసి ఇంటి నిర్మాణం

● కలెక్టర్‌కు బీజేపీ నేత శ్రీధర్‌గౌడ్ ఫిర్యాదు

మన్సూరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి అక్రమకంగా నిర్మాణం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నేత పాతూరి శ్రీధర్‌గౌడ్ కోరారు. బుధవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఆయన ఫిర్యాదు అందజేశారు. సరూర్‌నగర్ మండలం మన్సూరాబాద్ సర్వే నం.5లోని ప్రభుత్వ స్థలంలో చంద్రకళారెడ్డి అనే మహిళ సుమారు 200 గజాల స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాన్ని ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలోనూ ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి తప్పుడు పత్రాలు సృష్టించి, ఆ స్థలాన్ని తన బంధువులకు అప్పగించిందని, ఇప్పుడు మరోసారి కబ్జాకు పాల్పడుతుందన్నారు. మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవటం లేదన్నారు. తక్షణమే అక్రమ నిర్మాణాన్ని నిలిపివేయించి, ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని కోరినట్లు శ్రీధర్‌గౌడ్ తెలిపారు.

నివాస ప్రాంతాల్లో హాస్టళ్లకు అనుమతి ఇవ్వొద్దు

● వనస్థలిహిల్స్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు యాదిరెడ్డి

వనస్థలిపురం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నివాస ప్రాంతాల్లో హాస్టళ్ల నిర్వహనకు అనుమతులు ఇవ్వకుండా అధికారులు చర్యలు తీసకోవాలనీ వనస్థలిహిల్స్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు మల్‌రెడ్డి యాదిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కంచి కృష్ణమోహన్ విజ్ఞప్తి చేశారు. బుధవారం కాలనీ సంక్షేమ సంఘం కార్యాలయంలో వారు మాట్లాడుతూ తమ కాలనీలో నిబంధనలకు విరుద్ధంగా నూతనంగా భవనాలు నిర్మించి, వాటిల్లో హాస్టళ్లకు అద్దెకు ఇవ్వడంతో డ్రైనేజీ, పార్కింగ్ సమస్యలు వస్తున్నాయన్నారు. కమర్షియల్ బిల్డింగ్‌లు మాత్రమే హాస్టళ్లకు అనుమతులు ఇవ్వాలన్నారు. గృహ సముదాయాల మధ్య హాస్టళ్లకు అనుమతులు ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తామని వారు తెలిపారు.

దొంగతనం కేసును ఛేదించిన పోలీసులు

● ఇద్దరి అరెస్ట్ ● రూ. 6.83 లక్షల నగదు స్వాధీనం

సరూర్‌నగర్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ పోలీసు స్టేషన్ పరిధిలోని అల్మాస్‌గూడ విశాకనగర్ కాలనీలో ఈ నెల 13న జరిగిన దొంగతనం కేసును పోలీసులు ఛేదించారు. ఇద్దరిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ. 6.83 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం కేసుకు సంబంధించిన వివరాలను విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ వెల్లడించారు. వికాస్ నగర్ ఉంటున్న బి. శ్రీనివాస్ మీర్‌పేట్ కార్పొరేషన్‌లో ఏఈగా పనిచేస్తున్నాడు. ఈ నెల 13న ఇంటికి తాళం బయటకు వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో తాళం పగులగొట్టి ఇంట్లో బీరువాలో దాచిన రూ. 11 లక్షలు దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు సమీపంలోని సీసీ కెమెరాల ఫుటేజీలు పరిశీలించారు. మంగళవారం సాయంత్రం మీర్‌పేట్ నందిహిల్స్ చౌరస్తా ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా చోరీకి పాల్పడనట్టు అంగీకరించారు. బాలాపూర్‌లోని బాబానగర్‌కు చెందిన షేక్ ఫిరోజ్(25), నిజామాబాద్‌లోని ఆటోనగర్‌కు చెందిన అమీర్(23) మంగళవారం అరెస్ట్ చేశారు. మరో నిందితుడు మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన షేక్ అమీర్(25)పరారీలో ఉన్నట్టు ఇన్‌స్పెక్టర్ చెప్పారు.

మహిళకు ఫోన్‌లో అసభ్య సందేశాలు, వేధింపులు

● నిందితున్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన సైబర్ సెల్

హైదరాబాద్ సిటీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వాట్సాప్, సోషల్ మీడియా ద్వారా అసభ్య సందేశాలు పంపిస్తూ మహిళను వేధించిన పోకిరీని రాచకొండ సైబర్ సెల్ అధికారులు అరెస్టు చేశారు. బాధితురాలి ఫోన్ నెంబర్‌కు వరసగా నెంబర్లు మారుస్తూ వాయిస్ మెసేజ్‌లు, ఇతర సందేశాలు పంపిస్తూ కొన్ని రోజులుగా వేధిస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు వరంగల్, కాజీపేట ప్రాంతానికి చెందిన తోట పవన్ (32) అరెస్టు చేశారు. విచారించగా... 2013లో తన కుమారున్ని స్కూల్ వద్ద డ్రాప్ చేయడానికి వచ్చిన మహిళను పవన్ పరిచయం చేసుకున్నట్లు నటించి ఆమె ఫోన్ నెంబర్ తీసుకున్నాడు. ఆ తర్వాత తనను ప్రేమించాలని వివాహితయైన ఆమెను వేధించసాగాడు. దాంతో కక్ష పెంచుకున్న పవన్ ఫోన్ ద్వారా వేధించసాగాడు. నిందితున్ని రిమాండ్‌కు తరలించినట్లు అధికారులు వెల్లడించారు.

హిట్ అండ్ రన్!

(5వ పేజీ తరువాయి)

కోసం ప్రయత్నిస్తుండగా బుధవారం మధ్యాహ్నం ఆ కారు(హుండయ్ వెర్నా) ఎస్‌ఆర్‌నగర్ పోలీసుస్టేషన్ వద్ద హఠాత్తుగా ప్రత్యక్షమైంది. ఆ కారు అక్కడికి ఎలా వచ్చింది? అనేది పోలీసులు కూడా చెప్పలేకపోతున్నారు. మరో పక్క, ఈ కేసుకు సంబంధించి ద్వారంపూడి నాగ అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. కారు నడిపిన నాగ ఓ రాజకీయ నాయకుడి బంధువు అని ప్రచారం జరుగుతోంది.

మరోపక్క, పోస్టుమార్టం అనంతరం తారక్‌రామ్ మృతదేహాన్ని బుధవారం సాయంత్రం తర్వాత జూబ్లీహిల్స్ పోలీసుస్టేషన్ వద్దకు తీసుకొచ్చి అతడి బంధువులు ఆందోళనకు దిగారు. నిందితులను తప్పించే ప్రయత్నం చేస్తున్నారంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

చారిత్రక ఘట్టాలకు వేదికగా గోల్కొండ


చిరంజీవితో కలిసి జ్యోతిప్రజ్వలన చేస్తున్న కిషన్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో చారిత్రాత్మక ఘట్టాలకు వేదిక గోల్కొండ అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. యాదాద్రి భక్తులకు ఎంఎంటీఎస్ రైలు సేవలు అందుబాటులోకి తెస్తామని చెప్పారు. గోల్కొండ కోటలో 3డీ మ్యాప్ ప్రొజెక్టర్, హై రెజల్యూషన్ లైట్స్ షోను రాజ్యసభ సభ్యుడు విజయేంద్ర ప్రసాద్, సినీ నటుడు చిరంజీవితో కలిసి మంత్రి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌ను సందర్శించే ప్రతి ఒక్కరూ గోల్కొండను వీక్షించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో లేజర్ షో ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ షో తెలుగు, హిందీ, ఇంగ్లీష్‌లో ఉంటుందని, మన సంస్కృతి, చరిత్ర గురించి దీని ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు. 1400 ఎల్ఈడీ లైట్లతో నిత్యం దేదీప్యమానంగా గోల్కొండ వెలుగొందేలా ఏర్పాట్లు చేశామన్నారు.

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర మరో బ్రాంచి ప్రారంభం


హయత్‌నగర్ బ్రాంచిని ప్రారంభిస్తున్న బ్యాంకు అధికారులు

హైదరాబాద్ సిటీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర హయత్‌నగర్ శాఖను బుధవారం హైదరాబాద్ జోన్ జోనల్ మేనేజర్ సుశాంత్ కుమార్ గుప్తా, డిప్యూటీ జోనల్ మేనేజర్ మహమ్మద్ షజీబ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రోహిత్ రిషిలు ప్రారంభించారు.. హోటల్ రాజధాని కాంప్లెక్స్, ఆటోనగర్‌లో ప్రారంభమైన ఈ శాఖ కస్టమర్లకు అందుబాటులోకి వచ్చింది. భారతదేశంలో 28 రాష్ట్రాలు, 5 కేంద్రపాలిత ప్రాంతాలలో 2200 కంటే ఎక్కువ శాఖలతో 30 మిలియన్ల కస్టమర్లకు సేవలందిస్తోందని... తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 33 జిల్లాల్లో 64 శాఖలున్నట్లు బ్యాంకు అధికారులు తెలిపారు.

రూ.లక్షకు ఐదు లక్షలు

(5వ పేజీ తరువాయి)

యాడ్ చేశారు. డిసెంబర్ 29న రోలెక్స్ హైదరాబాద్‌లోని మెహిదీపట్నం వచ్చారు. నల్లటి కలర్‌లో ఉన్న బ్లాక్ కరెన్సీని వారి వద్ద ఉన్న కెమికల్‌లో కడిగి అది ఒరిజినల్ రూ. 500 నోటుగా మారడాన్ని కళ్లకు కట్టినట్లు చూపించారు. రూ. లక్షకు రూ. 5 లక్షలు బ్లాక్‌కలర్ కరెన్సీ ఇస్తామని చెప్పడంతో విష్ణువర్ధన్‌రెడ్డి అంగీకరించాడు. సరిగ్గా వారం రోజుల్లోనే బాధితుడు రూ. 5లక్షలు రెడీ చేసుకున్నాడు. విషయం డేవిడ్‌కు చెప్పడంతో ఈ ఏడాది జనవరి 5న డేవిడ్ ప్రతినిధులైన మరో ఇద్దరు జోసెఫ్, కోంబి ఫ్రాంక్ సెడ్రిక్‌లు మాదాపూర్‌లోని ఒక హోటల్లో దిగారు. విషయం తెలుసుకున్న బాధితుడు రూ. 5లక్షలు తీసుకొని హోటల్‌కు వెళ్లాడు. అక్కడ రూ. 5లక్షలు తీసుకున్న జోసెఫ్, కోంబి ఫ్రాంక్ సెడ్రిక్‌లు ఒక ట్రంక్ పెట్టెను విష్ణు చేతికి ఇచ్చారు. అందులో రూ. 25 లక్షల విలువైన బ్లాక్ కలర్ కరెన్సీ ఉందని చూపించారు. అదే సమయంలో ఒక రకమైన పౌడర్‌ను విష్ణువర్ధన్ కూర్చున్న చోట చల్లడంతో మగతకు గురయ్యాడు. అనంతరం ఆ ట్రంక్‌పెట్టెను తీసుకొని విష్ణు ఇంటికి వెళ్లి కెమికల్‌లో ముంచి ఎంత క్లీన్ చేసినా తెల్లకాగితాలే వస్తున్నాయి.. కానీ, కరెన్సీ నోటు కాలేదు. దాంతో బాధితుడు మోసపోయినట్లు గుర్తించి షాకయ్యాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీపీ ఆదేశాలతో మల్కాజిగిరి ఎస్‌వోటీ పోలీసులు రంగంలోకి దిగారు. టెక్నికల్ ఎవిడెన్స్ సేకరించి ముఠాలోని కోంబీ ఫ్రాన్స్ సెడ్రిక్, గోయిటా సౌన్‌గాలోను అరెస్టు చేశారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారు.చాకచక్యంగా విదేశీ ముఠాను పట్టుకున్న మల్కాజిగిరి ఎస్‌వోటీ ఇన్‌స్పెక్టర్ రాము టీమ్‌ను, డీసీపీ గిరిధర్, ఏసీపీ వాసులను సీపీ అభినందించారు.

564 మంది అరెస్ట్

ఆఫ్రికన్ దేశాలకు చెందిన 564 మంది గత మూడేళ్లలో దేశవ్యాప్తంగా మోసాలకు పాల్పడినట్లు గణాంకాలు చెబుతున్నాయని రాచకొండ పోలీసులు వెల్లడించారు. ఆఫ్రికన్ దేశాల ఎకానమీలో పదిశాతం మోసాలతో సంపాదించిన డబ్బు ఉంటుందన్నారు.

నగరం మరింత అద్భుతంగా..

(5వ పేజీ తరువాయి)


పేర్కొన్నారు.బార్కస్‌లో 50 పడకల ఆస్పత్రిని నిర్మించేందుకు రూ.9.50 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు.

అధునాతన ఫిష్ మార్కెట్..

నగరంలో కూరగాయలతో కలిపి అధునాతనమైన అతిపెద్ద ఫిష్ మార్కెట్‌ను నిర్మిస్తామన్నారు. గత ప్రభుత్వం హైదరాబాద్ కలెక్టరేట్ భవన నిర్మాణాన్ని పట్టించుకోలేదని, తమ ప్రభుత్వం తప్పకుండా దీనిపై దృష్టి సారిస్తుందని, విశాలమైన స్థలంలో ఎవరూ ఊహించని విధంగా భారీ సముదాయాన్ని నిర్మిస్తామని చెప్పారు.

రేషన్‌కార్డులకు 10 లక్షల దరఖాస్తులు..

జిల్లాలో రేషన్‌కార్డులకు 10 లక్షల మంది, మరో 3 లక్షల మంది గ్యాస్, మహాలక్ష్మి, తదితర పథకాలకు దరఖాస్తు చేసుకున్నారని మంత్రి తెలిపారు.అర్హులందరికీ తప్పకుండా న్యాయం చేస్తామని పేర్కొన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి హోదాలో ప్రతీ నియోజకవర్గానికి రూ.10 కోట్లు కేటాయిస్తానని తెలిపారు. త్వరలో జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి సమీక్ష నిర్వహిస్తామన్నారు. 58, 59 జీవోలను అడ్డుపెట్టుకుని గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. జిల్లాలో ల్యాండ్ బ్యాంక్‌ను కాపాడే విషయంపై తహసీల్దార్లకు తగిన సూచనలిస్తామన్నారు. సమీక్షలో భాగంగా మంత్రి పొన్నం పలు శాఖల అధికారులపై స్వల్ప ఆగ్రహం వ్యక్తం చేశారు. సమీక్షలో హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అడిషనల్ కలెక్టర్ మధుసూదన్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, తదితరులు పాల్గొన్నారు.



శివచరణ్‌రెడ్డిని అభినందించిన కాంగ్రెస్ నేతలు

మన్సూరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారెంటీలను ప్రజలకు వివవరించి, కాంగ్రెస్ గెలుపునకు కృషి చేసిన యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిన జక్కిడి శివచరణ్ రెడ్డిని.. రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీ, కాంగ్రెస్ నేతలు బుధవారం గాంధీభవన్‌లో ఆయన అభినందించి, ప్రశంసా పత్రం అందజేశారు. సీడబ్ల్యూసీ సభ్యుడు నజీర్ హుస్సేన్, ప్రచార కమిటీ ఛైర్మన్ మధుయాష్కీ, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డిలు అభినందించిన వారిలో ఉన్నారు.



తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా-2024 క్యాలెండర్‌ను బుధవారం ఎల్‌బీనగర్‌లో రాష్ట్ర అధ్యక్షుడు కందుకూరి శ్రీనివాస్, కార్యదర్శి మద్దునూరి వెంకటేష్‌లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎస్.నాగయ్య, నక్క యాదగిరి, బీసీ రెడ్డి, బెనర్జీ, మహేష్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సత్యం. గణేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

- (హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి)